# పుణ్యాత్ములు

★

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

పొద్దు సుంకిపోయింది. చీకటిమాత్రం పడలేదు. శివరాత్రి ముందురోజులేమో, చిన్న చలి వేస్తూనే ఉంది. గుర్రాల పాలల్లాగ వరసగా ఉన్న కూలీలయిళ్లు—రాతిపై బొగ్గు రాజేసేరు కాబోలు—రెయిలుయింజన్లకిమల్లే గుప్పుగుప్పున పొగలు జిమ్ముతున్నాయి. పైనుంచిపడ్డ మంచుతెరా, క్రిందనుంచిలేచిన పొగ మేఘాలూ, యిళ్లకి రెండుతాళ్లయెత్తున స్తంభించిపోయేయి. అంతా మసకమసకగా ఉంది. ఆ చాటునుంచి వీధులో దీపాలు, నల్లచీర మీద పగడాల సేరులాగ, మందంగా యెర్రగా కనిపిస్తున్నాయి.

అప్పుడే వొచ్చిన పాపకి అదంతా ఓ మాలోకం. ఇన్నాళ్లూ గురువులూ, వాడిపట్నం, ఆ "దూటీ"లూ అవీ వాళ్లూవీళ్లూ చెప్పుకుంటూ ఉంటేగా వినడఁవేగాని, ఏనాడూ చూసేభాగ్యం పట్టలేదు యింతవరకూను. అసలు పెద్ద పండుగకే తీసుకువెళతానన్నాడు వాళ్లఅయ్య. అయితే, కమతగాళ్లని కూడగట్టుకోవడంతోనూ, కళ్లంలో నూర్పులూ వాటితోనూ మరి తీరుబాటు కాలేదు అతనికి. కనుమా, ముక్కనుమా కూడా దాటిపోయినాయి. అప్పటికి వెళదాం అనే అయ్య తీరా బయలుదేరదాం అనుకున్ననాడే యెల్లావు యీనింది. దాని జున్ను అయినా తీసుకువెళదాం అనుకుంది పాప.

"మా కరణం బాబున్నాడు గాదూ. యెల్లావు కోడిదూడ్నేసిందని సెప్పేట అయ్య. ఆయమ్మ జున్ను పాలంటూ పళ్లిగిలించింది. ఆయమ్మ నీళ్లోసుకుందినే. కాపోయినా, పేమ్మర్లే వొంజాల జున్ను" అంది పాప, గురువులు తల్లితో పిచ్చాపాటి మాట్లాడుతూను.

"పోనేటిపోయింది సెత్తా, పుణ్ణెఁవే"అంది ముసలిది బోసి నవ్వు నవ్వుతూను. ఆ ముఖంలో మాతృత్వం వెల్లివిరిసింది.

"ఆయమ్మ మా మంచోరత్తా మొన్న పెండిలికడేమో—ఇయ్యాల పయనం అయినాం అనుకో, విన్నన్నమాట—ఆయమ్మ నీలంతోడుతోంది. నాతికాడ కూకోని, సినంట్లుతోఁవుతున్నాను. 'పట్నం ఎలుతున్నాను కోటమ్మగోరూ' అన్నాను. ఏదో అడిగితేని..."అంటూ రాజుకుంటూన్న కుంపటిలోనించి అగ్గితీసి చుట్ట ముట్టించింది పాప, 'అబ్బోసి, అలాగంటే. ఈ పాలి యెల్లినానివి యెల్లినట్టొస్తే వొప్పుకోను తెలిసిందా? అడితో కలిసిరావాల. ఇదుగో పాపా, పొర్దేలగట్టులా' అని పిలిసి ఊరగాయెట్టిందా యమ్మ. మా మంచోరునే యత్తా. ఆ యమ్మకి కొడుకుపుట్టిన్నా—నవనవనవనాడిపోతూ ఎంత బాగుంటాడనుకున్నవత్తా..."వోరగా అంటుకున్న చుట్ట ఉప్పుఉప్పుని ఊబటించి కాలుస్తూనే అంది పాప.

"నీకూ ఉసెశాళ్ళే. గురువులకి మనసే నీమీద." ముసలిది మురిసిపోయింది.

"పల్లకో, అత్తా" సిగ్గుతో కేవురించిన మొహం గుండెల్లోకి దించేసుకుంది పాప. ఒక్కనిముషం యెవ్వరూ మాట్లాడలేదు. ఆ తృటికాలంలోనూ పాప, గురువుల సుఖపరిష్వంగంలో ఒళ్లు పైమరచిపోయింది. స్వాప్నికంగా నయితేనేం గాక, ముసలిదాని కయితే అరిచేతుల్లో మనవడు ఆడుకుంటూన్నట్టే కనిపించేడు.

"అడింకా రాడేం? పొద్దుగూకిపోనాది" పాప ప్రారంభించింది.

"యేలే యిది. వొత్తానే ఉంటాడు. ఇయ్యాలే యినాగ యిందిగాని, రోజూ పెందలికడే "దూటీ". రేపటికాణ్ణుంచి అల బొద్దులేల కొచ్చేస్తాడ్నే—మాపిటిదాకా ఊసులాడుతూకూకుందువుగాని."

"లేయమ్మ. బియ్యంఅయినా కడుక్కొత్తాను. పొయ్యి ఊరికే మండిపోతాఉంది. అబ్బ. ఈ బొగ్గులేటో మరీ యేడి!!"

"రాబ్బసి బొగ్గమ్మ. నా కొడుకడి పనిసేత్తాడు. భునాది గోతు న్నాగంతిసోతు ఉంటాయనుకున్నా! ఓ పాలి తీసుకెల్లి సూపిస్తు. ఆటి కడో పేరు సెప్పినాడెమ్మ—నిత్తరం. నాను అప్పుడే మరిసిపోనాను."

"గన్లు" అపూర్వ మధురంగా స్మృతిలో ఉంచుకున్న ఆ ముక్క ఛట్టున చెప్పుకుంది పాప, పాడ్యమి చంద్రవంకలాగ చిన్న నవ్వు నవ్వుతూను.

"ఆఁ. గన్లు. ఆటినోకెల్లి బొగ్గు తవ్వుతారీల్లు."

"అంత నోతు కెలా గెడతారో?" పాప ఆశ్చర్యపడింది.

"పరంజాన్నాటి వుంటాయినే. ఆటిమీద దీల్లు కూకుంటారు. ఆటికి తాల్లుకట్టి మెల్లిగా దింపుతా రీల్లని."

"ఓలమ్మో!" ఎంతో ప్రమాదంఅన్నట్టు లోగొంతుకలోంచే అరిచింది పాప.

"మనఁవేటి సెయ్యగలఁవే. కూలి బతుకంటే యేటి? ఉఁహూ సెపు. అన్నింటికీ ఆ భగమంతుడే వున్నాడు. ఆడే రచ్చిత్తాడ్నే. ఏటి, కూలికెల్లినాల్లంతా సచ్చిపోతున్నారేటి?"

౨

పాపకి ఆవూళ్ళో మనుషులతీరే అదేదోలాగ తోచింది. గుమ్మంలో పేడనీళ్లు చల్లడం, ఓయిల్లు అలుక్కోవడం, పిడకలు కొట్టుకోవడం—చివరకి ఓ పెయ్యని విప్పడం కూడా—యేమీ లేదు. ఎవడో తెల్లవారకుండా వొచ్చి పాలుపోసి పోతాడు. గుమ్మంలోకి వస్తే ముసలిది ఓ అణావి చిలగడదుంపలూ, అర్ధణా పచ్చిమిరపకాయలూ, వేడపెట్టి ఎండుపరిగెలూ కొంటుంది. "వీళ్లో గుమ్మంలో పశువూ నేదు; దొడ్లో మొక్కా నేదు. ఎలా గుంటన్నారమ్మా! డబ్బుకి డబ్బిచ్చి కొంటేత్తారు పెతీదీని" అనుకుంది పాప ఓ నాడు పొద్దున్నే లేచి, గురువులుకోసం చలిదికూడు ఎల్లూమినం గిన్నెలో సద్దుతూను. గురువులు ఏఁవిటో హడావిడిగా తయారయిపోతున్నాడు.

"పలకర్ర సేసినావేఁటి? యిదపుడుక" పాప వసారాలోంచే పలకరించింది.

"ఇంకా పలకర్రేటి? దూటీకెల్లిపోతూంటేని! గురువులంటే యేటో తెలుసా? పనోల్లందర్నోకి ఘట్టుపరమాన్నం... అహాహ్హా..." హృదయం విప్పారేటట్టు నవ్వేడు.

"మాపెద్ద సేపినావ్. సాల్నే. ఊ, యిరగబడి పోతున్న పిల్లోడు!"

"దూటీఅంటే యేటనుకున్నావేటి? ఇదో పాపా, యీదీపం చూసినావా! దొరగోరు కవిపెట్టిన్రు. ఇదొట్టు కెలిపోతే, అనా గలిపోడవే అడుక్కునీ."

"నూతులో దిగివట్టుంటారేట్రా, అదీ?" పాప యెంతో కౌతుకక్యంతో అడిగింది.

"ఒకసయ్యా? పాతాళంవే. జై పాతాళభైరవి" అంటూ పాప బుగ్గమీద చిటిక వేసి చలదిమూట అందుకున్నాడు గురువులు.

"ఆల్లకీ యీల్లకీ ఎట్టెయ్యక, సలిదికూంతె తిను. ఊరగాయ బద్దెట్టేను, సూసుకో. ఊరగాయంటె ఏటి అనుకున్నావో, కేమ్మర్ల ఊరగాయబద్ద. వోర్ర్గసుండాది." వాడిమొహంమీద మొహం పెట్టి ఊరించింది పాప.

"అఁ అఁ. మరిసేపోనాను. అయినాక అల్లా రాఁవులికి కూంత కూడెట్టుండిమీ, పాపం. అడికి కిందటి వోరంఅల్లా మాపెద్ద జరం కాసేసింది. కూలికెల్లే సేపోనాడు."

"కేసనుగింజలు సాలవు గావాలరా" పాప అనుమానంగా అంది.

"ఎక్కడికేటి సాలడానికి? ఏటి? నాయెుంకు అలబోద్దు అడికి పంపెయ్. రెండు పరిగెలుకూడా యెట్టు, మీ యూరగాయి బద్దాను. వోర్ర్గసుంటే ఆడికి జిమ్మ సెగిపోత్తాది."

"మరి నీమాటరా?"

"నాకేటే. ఉండిపోతాదేటి పాట్టనో కూడు. ఏటి?...కాఫీ కాగెత్తాన్నే వోటల్లోను."

"అయితే నానూ తిన్ను."

"అదేటే! నువ్ తిను. మాయమ్మకీ నీకూ కాకుంటే రొండు కేటి కూలిసెయ్యడం?"

"ఒద్దు నేరా. నాను తిన్ను." పాప గుండె లోతుల్లోంచి మాట్లాడింది. "ఈ పొద్దు నీయులబోద్దు. మాపిటికి నాయెుంతు కూడున్నా. అడికిమాత్రం యెలాగొత్తాదేటి! కూలికే యెల్లనేదంటున్నావ్. పున్నెఁవేనే...సచ్చిపోఁవేటి ఓపూట కూడు నేక పోతేని."

"నీ యిట్టం. నే నెల్తాను మరి. తలుపేసుకో" అంటూ వీధిముఖం పట్టేడు గురువులు. గడపదాకా సాగనంపడానికి వెళ్లింది పాప.

"మరి నా మాటేటి సెప్పినావే?" గురువులు రహస్యంగా అడిగేడు.

"ఏటామాట?" ఏఁవీ తెలియనట్టే అంది పాప. కొంటెతనంగా.

"ఇదుగో పిల్లా—" మరీ దగ్గరకి రాబోయేడు గురువులు.

"ఎర్రా, నీ వోలకం నువ్వూను. ఏటోలమ్మ, పిల్లోడి పరాచకాలు" చేపలాగ జారిపోయినపాప, మళ్లీ అక్కడే నుంచుంది, నవ్వుతో విసుక్కుని.

"కాదె మరి. మీ యయ్యతో సెప్పొద్దుటే—"

"పల్లకోరా. అఁ. ఇదేటోలమ్మ అదేమాట." ఈసారి పాప కోపం నటించింది.

"సరె లేయే. నీమీదే దీపెట్టుకోని ఎప్పుడో ఆ గనిలో నే సచ్చిపోతాను" బరువుగా అన్నాడు గురువులు.

"సచ్చిపోతావట్రా?" పాప కళ్లు చెమగిల్లిపోయేయి.

అంతలో సైరను మోగింది. గురువులు చకచకా వెళ్లిపోయేడు.

3

వీధి తలుపు కేసేసి పాప యిలా లోగుమ్మంలోకి తిరిగిందో లేదో, ముసలిది దగ్గుతో రొప్పుకుంటూ వచ్చింది, ఆదుర్దాగాను.

"నువ్వెందుకు సేచిపోనావత్తా? డాకేటరు బాబు కూకలేత్తాట్ట, ముందు కెడితేని. ఆడు మరీ మరీ సెప్పెయెల్లేడు...ఇక పలకర్ర."

"ఎల్లిపోనాడూ?" ఏఁవిటో నిస్పృహో, విచారమున్నా ముసలిదానికి.

"యేం! రోజూ యెల్లేయేదే. పొద్దు బోసే తియాల. ఆడు సెప్పినట్టు ఇయ్యాలా ఆడే పట్టుపరమాన్నం."

"అదే కాదే." ముసలిది నీళ్లు పుక్కిలించి ఉమ్మింది; కొంగులో మొహం తుడుచుకుని పాపకి దగ్గిరగా వచ్చి గోడకి జేరబడింది.

"ఇద కాఫీనీల్లు. నీ కొడుకే సేసిపెట్టిన్రు."

"ఏం కాఫీనీల్లో. నా కొడ్డే." ముసలిదాని గొంతులో కంపం. ఎందుకో కళ్ళంట నీళ్లు!"

"అదేటత్తా. ఏకుత్తా వెందుకూ? తాగు, తాగు. కాఫీ నీల్లయినా తాక్కపోతే బొత్తిగా యీవలాట్టి పోగలవ్."

"ఇయ్యే, ఇయ్యి. ఇంకేటుంటదేటి. ఆ బగవంతు డెలా రాసిస్తే అలా జరుగుద్ది."

ముసలిది ముక్కు ఎగబీల్చి కళ్లు కొంగులో వొత్తుకుంది.

"ఏటత్తా, ఎందుకలా ఏడుత్తావు పొద్దున్నేని?"

"ఏటి సెప్పమంటావమ్మా. సెడ్డ కలొచ్చింది పెందలేని. తెలివేసే ఉన్నానమ్మా లేతిరల్లాను. బూడుసు బండొచ్చి కాదూ? ఇంజారం కూసిందీ? అప్పటికి తెలివేసే వున్నాను. అవాలాగే కునుకొచ్చేసిందోలమ్మ! మన సింగుపురం సేదూ? ఏరుదాటి పాలా లెమ్మటే యెల్తన్నాం అమ్మా, మీ మాఁవా, నానూను. ఆ రేవూ యీ రేవూ పచ్చంగ పొలాలు. రేవుగా ఎదిగి మొక్క నీ యెత్తుందనుకోయమ్మా. అదేటిదో. నాను సెప్పలేను. నీ తిరమే నే. ఏడ నూసినా నూపారినంత మేర పాలఁవే. ఇంకో నీ త్తిరవమ్మా. ఇలా గడుతున్నాఁవా? ఈ రేవల్లా పైరు, ఆ రేవల్లా రూవులూను. తెల్లంగ మీగడవాకున్నాయే ఆ రూవులు. మా లచ్చిమే. మీ మాఁవయితే వొల్లు మరిసిపోయి "గోంగూర పదం" పాడుతున్నా. ఆడితో ఆసికా లాడుకుంటూ యెంబటే యెల్తన్నాన్నేను. నాలు గడుగులే అలాగేసేఁవోలమ్మ—"

ముసలిదానిగొంతుక ఆకస్మాత్తుగా మారిపోయింది. శూన్యంలోకి చూస్తా, నిజంగా తన కళ్ళ యెదుట—అప్పుడు—ఏదో ఘోరం జరిగిపోతున్నట్టు కంపించి పోయింది. గద్గదికతో మళ్ళీ అందుకుంది—

"అలాగ ఆసికాలాడుకుంటూ యెల్తానే వున్నానే— అంతలోకి పెద్దగాలీ పరగడా సెగిసింది. ఆకాసివల్లా ఎర్రరగై పోవాలే, సీటంలోని! అయిపోయీా, వొరసం వొచ్చింది. వొరసంఅంటే ఏటనుకున్నావో. రత్తం కురిసిందమ్మ! రక్తవేఁనే. ఓ ఓ! పొలాలూగట్లూ మరి సేవు. అంతా ఒకటే నెత్తురు. బూకం తా నెత్తురుమయిం అయిపోనాది. తనువుకొత్తేనే వొల్లు గజగజ లాడిపోతాదో లమ్మ! ఏటో ఉక్కిరిబిక్కిరయిపోయిన్నాను. తెలివేసి నూతునుగందా, ఏటీ సేదు. ఎర్రగా పొద్దెక్కిపోనాది. ఆనాడి నా గేవమ్మ, నాన్నొగిసేసరికి మీ మావదూటీ కెళ్ళిపోనాడు, పలిదిరూకు ఆడే ఎట్టుకోని. అదే ఆకరి సూపయిపోనాది తల్లో గనిలో కెల్లినోడు మరి రానేదు. ఆయాల అలాగయిపోనాది. ఇయాలమల్లీ అదేకల. దెప్పకల. ఏం రాతో—బగమంతుడే రచ్చించాల" ముసలిదానికి ఆపినా ఆగకుండా పెల్లుబికివచ్చేయి,కన్నీళ్లు. పాపకి, సగం తెలిసీ సగం తెలియకా, మొత్తానికి మతిపోయింది. అయినా అకాత్తుగా చచ్చిపోవడం అంటే ఏదిటో ఊహించుకోలేని మనిషి.గనక సాపుగా అనుకంపతో అంది—

"ఏటి సేత్తాం అత్తా. తెమ్మకేవుఁడిరాత అలాగుందిగా తలప."

కానయితే దానిమాట పూర్తికాలేదు. ఆ వేళగాని వేళ వ్వుడు గనిలోంచి సైరను మోగింది. పాపకి చెవులు గింగిరుమన్నాయి. బుద్ధికి జడత్వం ఆపాదించుకుపోయింది. రెండూనిమిషాలపాటు అలాగ చిత్తరువులో బొమ్మలాగ, ఉండిపోయింది. మరికాస్సేపటికి—"ఏటత్తా" అని ఆక్రోశించింది.

ముసలిది మరిమాటాడలేదు. అసలు అది దుఃఖం దిగమింగుకుంటున్నట్టే తెలియనివ్వలేదు. అంతలో ధైర్యం తెచ్చుకుంది. "నువ్వుకూడొందమ్మా, నానిప్పుడే వొత్తానుగానీ" అంటూ అక్కణ్ణుంచి లేచి వీధివేపు వెళ్లిపోయింది. తలుపుతీసేసరికి వాడవాడంతా ఒకటే గగ్గోలు, "గని పడిపోయిందంటే, గని పడిపోయిం"దని. ముసలిదానికి యిదంతా చాలా అనవసరపు గొడవలాగ తోచింది. అడిగిన ఒకరిద్దరూ, "గనిలో ప్రమాదం" అనో, "పునాదులు పళ్ళిపోయేయి" అనో అన్నారే గాని పనికొచ్చే ముక్క ఒక్కరూ చెప్పలేదు.

"ఏటో, ఊపులా యే మాటా తిన్నగా సెప్పరూ" అని విసుక్కుంది ముసలిది.

"ఏటి పిన్నమ్మా. యిన్నావా పెమాదం?" అంటూ అప్పలమ్మ పలకరించింది అంతల్లోకేను. దాన్ని చూసేసరికి ముసలిదానికి జవసత్తులు పోొచ్చేయి. అప్పలమ్మ తనలాగ, గనులలో ఢక్కా మొక్కీలు తిన్నదే.

"ఏటయింది అప్పలమ్మా? ఏటా గోల్లి?"

"గని తవ్వకూం లేని పునాదు లడిపోయాయంట" అప్పలమ్మ ఖరారు అయిన భోగట్టా చెప్పింది.

"యే లంబరే?"

"తొలీ లంబరేవ్వ పిన్నమ్మా" అప్పలమ్మ మాటల్లో వివరాలు తెలుస్తున్నాయి.

"నీ కొడుకెల్లినాడేటి?" ముసలిది మళ్ళీ అడిగింది.

"ఆడా? ఆడు మరీ పోకిరీ అయిపోతున్నడు. నిన్న రేతిరి తప్ప తాగేసొచ్చిన్డు యింటికి. బారెడు పొద్దెక్కినా సెగేనేదు ఇయాల. మరాడికి డూటీ యేటి, నా మొకం......నీ కొడుకో?"

"ఆడెల్లినాడప్పలమ్మ. పెందిలే యెల్లినాడు, యెప్పటిలాగే."

"అడిగితేటే మా రాజు. ఆ దెప్పుడూ సిరీ సుక్కాము... నాకు తెలీక అడుగుతానా—"

"స్సు. మెల్లిగా మాట్లాడే నీ జిమ్మడ."

"హొవట్టు. మరిసేపోనాను. ఏటిసేత్తోంది పాప?"

"ఏటిసేత్తాది? పేణాలన్నీ ఆడిమీదే యెట్టుకుందానుంట."

"నిజఁవే పిన్నమ్మా. అది యిలాంటిగోరాలు నూ సెరగదు. దాన్ని మాత్రం యీాది నోకొగ్గేవుగనక! గుండె పేలి సచ్చిపోతాది సుమీ, అక్కడేటి అనుకున్నావో!"

"తెల్దేటి, అప్పలమ్మా, ఎరఁగనాసేటి? అమ్మోర్గొరాల. తుంతేలూ మొంతేలూ, దుమ్ములూ నెత్తురూను. ఎవురెరగఁవేటి? రక్తప్రభావం అయిపోద్ది."

"బాగా చెప్పినావ్...రొల్లమ్మా, రొలిపో కోపలికి. ఆ గుంటని మాసుకో." ఆత్రుతగా వస్తున్న పాప కంటపడేసరికి అప్పలమ్మ ధోరణి కట్టి పెట్టి తివదారిని పోయింది. చివరి ఒకటి రెండుముక్కలూ వినిపడ్డాయేమో, పాపగుండెల్లో ఒకటే తుపాను. ఇంకా మరి పట్టలేక ముసలిదాన్ని అడిగింది—

"ఓపాలి కనికాడి కెల్లొత్తనత్తా."

"నీకేటి మతిగాని పోవాదేటి ?" ముసలిది మందలించింది, "ఆడంతా యేటిదో తెలుసా ? అమావ్యాసి పంబరేవ్రా, పోలిపిల్లి జాతిరా అనుకున్నావా నేటి నీ మనసులోకి ? ఎలాగున్నాడో, ఎలాగొత్తాడో ! నా మాటినీ, ఆడికొ సులకమంచం వోసేసి పక్కెయ్యి. సూడూ. నా బొంతా అది బొంతా కోడించి ఎయ్యి ; మెత్తగుంటాది." మొండిధైర్యం తెచ్చుకుని ముసలిది అలా పనులు పురమాయిస్తూనే ఉంది.

పాప ఆరాటానికి అంతులేదు. పక్క వేస్తూ ఓ లక్షసార్లు అనుకుంది "ఏం పెమాదేవో యేటో. బెష్టమరుండని ఆశ మరీ మరీ అడిగితేని ఏ కబురూ చెప్పకుండా ఏడిపించుకు తిన్నాను. ఆడు అన్నట్టు నామీదే దీసెట్టుకు సచ్చిపోవాడో యేటో ?"

పాపకి అనేకంఅయిన ఆలోచనలు రేకెత్తి యేదీ స్థిరంగా నిలవకుండా మనస్సుని కలిచి పారేసేయి. ముసలిది పురమాయించిన పనులు అలాగ యంత్రవతుగా చేసుకుపోతోంది. అంతలో గిధి తలుపు దబదబా బాదిన చప్పుడు ! అక్కడే ఉన్న ముసలిది గడియ తీసింది. పాప ఉన్న చోటునుంచి కదలకుండానే వెనక్కి తిరిగి చూసింది. ఓ నలుగురు మనుషులు గురివుల్ని స్ట్రెచ్చరుమీద తెచ్చేరు. పాప చప్పున దుప్పటీ పరిచి గోడవేపుకి తప్పుకుంది. వాళ్లు తిన్నగా వచ్చి గురువుల్ని మంచంమీద పడుకోబెట్టేరు. గురువుల వొంటినిండా దూది అంటింపులూ, ఊవిడో ఘాటం వాసనా. పాపకి గుండె ఆగిపోయింది! కాని, ముసలిదానికి ఏవిటో ఆ ధైర్యం ! వాడి మొహంమీద మొహం పెట్టి నిద్దరోతూన్న వాడితో అన్నట్టు అంది—"అబ్బీ, గురువులూ, నాన్నా ముసిలి దాన్ని."

గురువులు స్పృహగానే ఉన్నాడు—"రావులుకి కూడంపి నారే ?"

"అంత మరీ మరీ చెప్పిరొల్లినావుగదా, పంపేవా ?" అంది ముసలిది.

గురువులు బాధ అపనయించుకుంటూన్నట్టు బరువుగా మూలిగేడు. ముసలిదాని గుండెల్లో భోహాటం యాడ్చినట్టయింది.

"ఏట్రా ? చెయ్యా కాలూ... పెమాదం యేటి ?"

"ఏటీ లేదమ్మా. కాసింత సెక్కుకుపోనాదంతే. మా జట్టు జట్టంతటినోకి నా కొక్కడ్నే మిగిలిపోనాను." అంటూ కళ్ళంట నీళ్లు పెట్టుకున్నాడు.

"ఏటో మొండితనం. ఏకుత్తా ఇంకుకురా, అయ్యా...... పల్లకో, పల్లకో. ఏటి సేత్తాం. ఆ బగమంతుడే పున్నాడన్నంటి కిని" గురువులు వొళ్లు నిమురుతూ సముదాయించింది, ముసలిది.

"అది కాదే. నాను సచ్చినా తీరిపోను. బగవంతుడే రచ్చించేడ్లే. పాపకోసమే, దానికోసమే మిగిల్చినిష్ఠ నన్ను. అదేటిదో కాని దానిమీదే దీవి ఉండిపోవాదే."

మంచం తలాపు దిక్కున నిలుచుని యిదంతా వింటూన్న పాపకి యీ చివరిమాటలు చెవిని పడ్డంతోటే మరీ దుఃఖం ముంచుకు వొచ్చింది. నూతులో జలపడినట్టు, ఎక్కడో సెమ్మదిగా పుట్టి, కళ్లనిండి పెద్ద చెక్కిలిపైనుంచి జారిన అశ్రుకణం ఒక్కటి టక్కుమని గురువులు నుదుటిమీద పడింది. వాడు ఉలిక్కిపడి, కన్ను పైకెత్తిచూసేడు—"ఎక్కడా అలికిడి నేక పోతే రొంటెల్లేవనుకున్నాను. ఈడనే వున్నా ?" అని అడుగుతూనే దెబ్బలు తగిలిన కుడిచెయ్యి బరువుగా పైకి లాగేడు గురువులు. వెంబడే జాలిగా దీనంగా అడిగేడు "నామాట ఏటి చెప్పినావే ?"

పదిలంగా వాడి చెయ్యి తనచేతుల్లోకి తీసుకుని, చెక్కిలికి నొక్కి వొత్తుకుంటూ అంది పాప : "నీమాట నీమాట అంటా వేటిరా అత్తమానమ్మా, నీమాట యేరూ, నామాట యేరునా యేటి ?"

